ఇద్దరికి జీవిత ఖైదు

- తీర్పు చెప్పిన జిల్లా న్యాయాధికారి
- వివరాలు వెల్లడించిన భూత్పూర్ సీఐ రామకృష్ణ

భూత్పూర్, ఫిబ్రవరి 14 : అత్యాచారం కేసులో జిల్లా న్యాయాధికారి పాపిరెడ్డి ఇద్దరికి జీవిత ఖైదు శిక్ష విధించినట్లు భూత్పూర్ సీఐ రామకృష్ణ తెలిపారు. బుధవారం స్థానిక సీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన కేసు వివరాలను వెల్లడించారు. 2016 ఆగస్టు 9న మునిసిపాలిటీలోని ఓ వార్డుకు చెందిన మహిళ తన కూతురుకు బలవంతంగా మత్తు మందు తాపించి, అమిస్తాపూర్ గ్రామానికి చెందిన శ్రీనివాసులుతో అత్యాచారం చేయించింది. అప్పట్లో బాధితురాలు తన తల్లిపైన, నిందితుడైన శ్రీనివాసులుపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. అప్పట్లో ఎస్ఐగా పని చేసిన అశోక్, సీఐ గిరిబాబు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేశారు. ఈ కేసుకు సంబంధించిన పూర్వాపరాలను జిల్లా న్యాయాధికారి బుధవారం పరిశీలించారు. తల్లి తన కూతురుతో మత్తు మందు తాపించి, శ్రీనివాసులుతో అత్యాచారం చేయించినట్లు తగిన సాక్షాధారాలు రుజువు అయ్యాయి. దాంతో న్యాయాధికారి నిందితులకు జీవిత ఖైదు శిక్ష విధించారు. శిక్షతో పాటు ఇద్దరికి రూ.2500 అపరాధ రుసుము చెల్లించాలని తీర్పు ఇచ్చింది. ఈ విలేకరుల సమావేశంలో ఎస్ఐ శ్రీనివాసులు, పోలీసులు పాల్గొన్నారు.

పులకించిన అలంపూర్

- ఘనంగా జోగుళాంబ అమ్మవారి జాతర
- బోనాలు, కలశాలతో భక్తుల ఊరేగింపు
- ఆకట్టుకున్న పోతురాజుల విన్యాసాలు
- పురవీధులు జనసంద్రం
- అమ్మవారి నిజరూప దర్శనం
- కనులపండువగా కల్యాణం





కలశాలు, బోనాలతో ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

అలంపూర్ చౌరస్తా, ఫిబ్రవరి 14 : అలంపూర్ జోగుళాంబ బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివరి రోజు బుధవారం అమ్మవారు నిజరూపంలో దర్శనం ఇచ్చారు. ఈ వేడుకకు అధిక సంఖ్యలో తరలొచ్చిన భక్తులతో పట్టణం కిటకిటలాడింది. సహస్ర ఘటాభిషేకంలో పాల్గొనేందుకు భక్తులు కలశాలు, బోనాలతో అమ్మవారి సన్నిధికి చేరుకున్నారు. సుమారు 20 వేల మందికి పైగా అమ్మవారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఉదయం నుంచే అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేపట్టారు. తొమ్మిది గంటలకు యాగశాలలో నిత్యహోమాలు నిర్వహించారు. అనంతరం మహాపూర్ణాహుతి, సహస్ర ఘటాభిషేకం చేశారు. భక్తులు కలశాలతో అమ్మవారి గర్భాలయం వరకు వచ్చి కలశాలతో తెచ్చిన పవిత్ర జలాలు, పంచమృతాలు, గోక్షీరాలతో నిజరూపంలో ఉన్న అమ్మవారికి అభిషేకం చేశారు. నిజరూపంలో ఉన్న భక్తులను చూసి పులకించిపోయారు. కలశాలతో వచ్చే భక్తులకు ప్రత్యేక క్యూ లైన్ ఏర్పాటు చేశారు. అనంతరం భక్తులకు సేవాసమితి వారు, ఆలయ అధికారులు అన్నదానం చేశారు. తాగునీరు లేక ఇబ్బందిపడ్డారు.

డప్పుచప్పుళ్లతో మారు మోగిన హేమలాపురం

జోగుళాంబ బాలబ్రహ్మేశ్వరస్వామి సేవా సమితి ఏటా నిర్వహిస్తున్న ఈ ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. వసంత పంచమి సందర్భంగా అలంపూర్ పట్టణమంతా జాతరను తలపించింది. డప్పుచప్పుళ్లతో హేమలాపురం మారుమోగింది. ఏపీలోని ఏలూరు, హైదరాబాద్ నుంచి వచ్చిన 20 మంది కళాకారుల జోగుళాంబ, సుంకులమ్మ, రేణుక ఎల్లమ్మ, మైసమ్మ, పార్వతి దేవి, పోలేరమ్మ తదితర వేషధారణ, వారి నృత్యాలు ఆకట్టుకున్నాయి. న్యూ ప్లాట్స్ నుంచి భక్తులు బోనాలతో, కలశాలతో పుర వీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. దీంతో పట్టణంలోని వీధులన్నీ జనసంద్రమయ్యాయి. పోతురాజుల నృత్యాలు అలరించాయి. వారితో సెల్ఫీలు దిగేందుకు యువత పోటీపడ్డారు. అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా చూశారు.

ముగిసిన ఉత్సవాలు

సహస్ర ఘటాభిషేకం అనంతరం స్వామి, అమ్మవార్లకు కల్యాణం నిర్వహించారు. వేదమంత్రోచ్ఛరణల మధ్య.. వేలాది మంది భక్తుల సమక్షంలో కల్యాణం జరిగింది. ధ్వజారోహణంతో ఉత్సవాలు ముగిశాయి.



నిజరూపంలో దర్శనమిస్తున్న అమ్మవారు





కలశంతో జడ్పీ చైర్‌పర్సన్ సరిత, అభిషేకాలు చేస్తున్న భక్తులు

దొరికితేనే దొంగ

- ప్రభుత్వ శాఖల్లో వేళ్లూనుకున్న అవినీతి
- అధికారులు లంచం తీసుకుంటూ ఏసీబీకి వరుసగా పట్టుబడుతున్నా డోంట్‌కేర్
- ఏ పని కావాలన్నా చేయి తడపాల్సిందే..
- 40 రోజుల్లో అడ్డంగా దొరికిపోయిన ఐదుగురు అధికారులు



మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 14: ప్రభుత్వ శాఖల్లో అవినీతి పెరిగిపోతోంది. ముడుపులు చెల్లిస్తేనే పనులు జరుగుతున్నాయి. అందరూ కాకపోయినా.. చాలామంది అధికారుల తీరు ఇలానే ఉంది. ఈ నేపథ్యంలో దొరికిన వారే దొంగగా తేలుతుండగా.. తప్పించుకొని తిరుగుతున్నవారు ఎందరో ఉన్నారు. అధికారుల లంచం డిమాండ్‌తో బాధితులు అవినీతి నిరోధకశాఖను ఆశ్రయించి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టిస్తున్నా వారి తీరు మారడం లేదు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో 2023 సంవత్సరంలో లంచం తీసుకుంటూ ఐదుగురు అధికారులు ఏసీబీకి పట్టుపడగా, ఈ ఏడాది 40 రోజుల్లో ఐదుగురు పట్టుబడ్డారు. అందులో ఎక్సైజ్ సీఐ, సివిల్ ఎస్ఐ, మునిసిపల్ ఏఈ, సర్వేయర్, ఎలక్ట్రిసిటీ లైన్‌మెన్ ఉన్నారు.

కల్లు సొసైటీ కావాలంటే రూ.4 లక్షలు

గీత కార్మికులు టీఎఫ్‌టీ లైసెన్స్ పొందాలన్నా, టీసీఎస్ సొసైటీ చేసుకోవాలన్నా రూ. 3 నుంచి 4 లక్షలు ఖర్చు అవుతోంది. ఇందులో కింది స్థాయి నుంచి ఉన్నతాధికారుల వరకు వరుసగా అధికారి స్థాయిని బట్టి చెల్లింపులు చేస్తూ పోవాలి. ఈ క్రమంలోనే జడ్చర్ల ఎక్సైజ్ సీఐ బాలోజీనాయక్ టీఎఫ్‌టీ లైసెన్స్ కోసం రూ.90 వేలు డిమాండ్ చేసి, ఏసీబీకి దొరికిపోయారు. ఆయనపై ఇప్పటికే పెద్ద ఎత్తున ఆరోపణలున్నాయి. లైసెన్స్ కోసం వెళ్లే గీత కార్మికులను ముక్కుపిండి వసూలు చేస్తారన్నది బహిరంగ రహస్యమే. టీసీఎస్ లైసెన్స్ కావాలంటే 11 మంది సభ్యులకు టాడీ(చెట్టు ఎక్కి కల్లు గీయడం) పరీక్ష నిర్వహించాల్సి ఉంటుంది. వారి బలహీనతను ఆసరాగా చేసుకుని అక్కడి నుంచే బేరం మొదలెడతారు. కానిస్టేబుల్, ఎస్ఐ, సీఐ, వాళ్ల డ్రైవర్లు, ఉన్నతాధికారులు, కోఆపరేటివ్ సెక్షన్.. ఇలా పలు సెక్షన్‌లకు ఫైల్ తిరగాల్సి ఉంటుంది. అడిగినంత ఎక్కడ ఇవ్వకపోయినా ఫైల్ అక్కడే ఆగిపోతుంది. ఇక గ్రామాలలో కల్లు దుకాణాలను విజిట్ చేయడానికి వెళ్తే.. వాళ్లకు ప్రత్యేక మర్యాదలు చేయాల్సి ఉంటుంది. మద్యం దుకాణాల నుంచి కూడా నెలనెలా ఠంచన్‌గా డబ్బులు వెళ్లాల్సిందే. పర్మిట్ రూమ్‌ల పేరుతో బార్‌లను తలపించేలా ఏర్పాటు చేసి నిబంధనలు ఉల్లంఘిస్తుండటంతో నెలనెలా మామూళ్లు వసూలు చేస్తున్నారు.

సెక్షన్‌లు తగ్గించేందుకు డబ్బుల డిమాండ్

పోలీస్ శాఖలోనూ అవినీతి పెరుగుతోంది. కొన్ని సెంటిమెంట్‌లు, పరువుకు సంబంధించిన కేసులో పెద్ద ఎత్తున డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. ఫలానా సెక్షన్ పెడితే బెయిల్ రాదని బెదిరించి, వసూళ్లకు పాల్పడుతున్నారు. వరకట్నం వేధింపుల కేసుల్లో కుటుంబ సభ్యులు, వారి తరపు బంధువుల పేర్లు కూడా చేరుస్తుంటారు. ఒక్కో పేరు తొలగించేందుకు ఒక్కో రేటు మాట్లాడుకుంటారు. వివాహేతర సంబంధాలు, ప్రేమ వ్యవహారాల్లో జైలుకు వెళితే పరువుపోతుందని భావించేవాళ్లు ఎంతైనా ఇచ్చేందుకు వెనుకాడరు. వారి బలహీనతల ఆధారంగా డబ్బులు డిమాండ్ చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. మహ్మదాబాద్ ఎస్ఐ సురేశ్ కూడా ప్రేమ వ్యవహారంలో సెక్షన్‌లు తగ్గించేందుకు రూ.50 వేలు డిమాండ్ చేసి, స్టేషన్‌లో డబ్బులు తీసుకుంటూ అడ్డంగా దొరికిపోయాడు. చాలామంది పోలీసులు.. సివిల్ వ్యవహారాల్లో తలదూర్చి భూ సెటిల్‌మెంట్‌లు చేస్తున్నారు. డబ్బులు ఎవరు ఇస్తే వాళ్ల పక్షాన పనిచేస్తూ బాధితులనే బెదిరిస్తున్నారన్న ఆరోపణలు లేకపోలేదు.

ఏసీబీని ఆశ్రయించండి

ఈ ఏడాది ఇప్పటికే ఐదు కేసులు బుక్ అయ్యాయి. చాలామంది ఒత్తిడికి లోనై డబ్బులు ఇస్తున్నారు. అలాంటి వారు ఎలాంటి భయాలకు లోనుకాకుండా నేరుగా ఏసీబీని ఆశ్రయించాలి. ప్రభుత్వ పనుల కోసం ఎవరూ డబ్బులు ఇవ్వాల్సిన పనిలేదు. ఏసీబీని ఆశ్రయిస్తే మీ పనులు కావన్న అపోహను వీడి, ధైర్యంగా ముందుకు రావాలి. అవినీతి రహిత సమాజం అందరి బాధ్యత. ఏసీబీని నేరుగా ఆశ్రయించలేని వాళ్లు 1064 టోల్‌ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేయవచ్చు.

- కృష్ణగౌడ్, ఏసీబీ డీఎస్పీ

మునిసిపాలిటీ, పీఆర్‌లో పర్సెంటేజీలు..

ఇక మునిసిపాలిటీ, పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ, నీటిపారుదల శాఖల్లో కింది స్థాయి నుంచి ఉన్నతాధికారి వరకు పర్సెంటేజీలు ఇవ్వాల్సి ఉంటుంది. అధికారి స్థాయిని బట్టి రూ.లక్ష బిల్లుకు ఇంత పర్సెంటేజీ అన్నట్లుగా వసూలు చేస్తారు. ఎంబీ బుక్ ఏ సెక్షన్‌కు వెళితే ఆ అధికారి స్థాయిని బట్టి ఇచ్చుకోవాల్సి ఉంటుంది. కొన్ని శాఖల్లో 10-20 శాతం అధికారులకే ఇవ్వాల్సి ఉంటుంది. అందుకే కాంట్రాక్టర్ నాసిరకం పనులతో సరిపెట్టినా అధికారులు చూసీచూడనట్లుగా బిల్లులు చేస్తుంటారు. మహబూబ్‌నగర్ మునిసిపల్ ఏఈ ఎంబీ బిల్లుల కోసం రూ.50 వేలు తీసుకుని పట్టుబడ్డ సంగతి తెలిసిందే.

రెవెన్యూ శాఖలో..

రెవెన్యూ శాఖలో పట్టాదారు పుస్తకాలు ఇవ్వాలన్నా, భూముల రిజిస్ట్రేషన్ సులువుగా జరగాలన్నా, చిన్న చిన్న లోపాలు సరి చేయాలన్నా పెద్ద మొత్తంలోనే డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. కార్యాలయాల చుట్టూ తిరగలేక వాళ్లు అడిగినంత ఇచ్చుకుని పనులు చేసుకుంటున్నారు. డబ్బులు ఇవ్వని వాళ్ళు ఏళ్ల తరబడి కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. గతేడాది వ్యవసాయ భూమికి సంబంధించిన రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ కోసం చారగొండ తహసీల్దార్ రూ.75 వేలు లంచం తీసుకుం టూ పట్టుబడ్డారు. ఇలా చాలా శాఖల్లో అవినీతి రాజ్యమేలుతోంది. దొరికిన వాళ్లు దొంగలుగా మిగిలిపోతుండగా.. దొరకని వారు యథేచ్ఛగా వసూళ్లకు పాల్పడుతూ ఆస్తులను పెంచుకుంటున్నారు.

మద్దతు ధర కోసం రైతుల ఆందోళన



అచ్చంపేటలో రాస్తారోకో చేస్తున్న రైతులు

అచ్చంపేట టౌన్, ఫిబ్రవరి 14: వేరుశనగకు మద్దతు ధర కల్పించాలని రైతులు బుధవారం అచ్చంపేట పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో రాస్తారోకో చేశారు. మద్దతు ధర ఇవ్వకపోవడంతో పెట్టుబడులు కూడా రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మార్కెట్ కార్యదర్శి నర్సింహులు మాట్లాడుతూ పంట నాణ్యతను బట్టి ధర నిర్ణయిస్తున్నామన్నారు. మార్కెట్‌కు దాదాపు 30 వేల బస్తాల వేరుశనగ వచ్చిందన్నారు. నాణ్యతకు అనుగుణంగా రూ5,000 నుంచి రూ.7,000 మధ్య ధర వచ్చిందన్నారు. రైతులకు అన్యాయం జరగడం లేదన్నారు. నాణ్యత లేకున్నా ఒకే ధర ఇవ్వడం సాధ్యం కాదన్నారు. నాణ్యత, తేమను బట్టి ధర ఉంటుందన్నారు. మార్కెట్‌లో మంచి ధరే వస్తుందన్నారు. ఎస్ఐ రాము రైతులతో మాట్లాడారు. మార్కెట్ కార్యదర్శితో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని చెప్పడంతో రైతులు రాస్తారోకో విరమించారు.

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన

- సమీక్షించిన నారాయణపేట కలెక్టర్, ఎస్పీ
- అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, అధికారులతో సమావేశం
- మహిళా సంఘాల సభ్యులతో సమావేశం, బహిరంగ సభ



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

కోస్గి రూరల్, ఫిబ్రవరి 14: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ నెల 18న కొడంగల్ నియోజకవర్గంలోని కోస్గిలో పర్యటించనున్నారు. అభివృద్ధి పనులను ప్రారంభించడంతో పాటు శంకుస్థాపనలు చేయనున్నారు. ఈ నేపథ్యంలో నారాయణపేట కలెక్టర్ కోయ శ్రీహర్ష, ఎస్పీ యోగేష్ గౌతమ్ బుధవారం ఏర్పాట్లను పరిశీలించారు. అభివృద్ధి పనుల శిలాఫలకాలను ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేస్తున్నారు. హెలిప్యాడ్, బహిరంగ సభ స్థలాలు, పార్కింగ్ ఏర్పాట్లను పకడ్బందీగా చేయాలని అధికారులకు చెప్పారు. సీఎం అభివృద్ధి పనుల ప్రారంభంతో పాటు అధికారులతో సమీక్ష చేయనున్నారు. లక్ష్మీనరసింహ ఫంక్షన్ హాల్‌లో మండల మహిళా సమాఖ్య సభ్యులతో సమావేశం అవుతారు. ఆ తర్వాత బహిరంగ సభలో పాల్గొంటారు. ఏర్పాట్లను పరిశీలించిన వారిలో అడిషనల్ కలెక్టర్ అశోక్‌కుమార్, శాఖల ఉన్నతాధికారులు, సీఐ సోమనర్సయ్య, తహసీల్దార్ శ్రీనివాసులు, మునిసిపల్ కమిషనర్ శశిధర్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువతి మృతి

- ఫోన్‌కు చార్జర్ తీస్తుండగా ఘటన

గండీడ్, ఫిబ్రవరి 14: ఫోన్‌కు ఉన్న చార్జర్‌ను తీస్తుండగా విద్యుదాఘాతానికి గురై యువతి మృతి చెందిన సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండలం పలుగు తండాలో చోటు చేసుకుంది. ఎస్ఐ శేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పలుగు తండాలో తుల్జాభావాని పూజ ఉండడంతో నారాయణపేట్ జిల్లా కొత్తపల్లి మండలం కొత్తపల్లి తండాకు చెందిన శంకర్ నాయక్ పెద్ద కూతురు సోనీబాయి కుటుంబంతో వచ్చారు. మంగళవారం రాత్రి 11:30 గంటలకు సోనీబాయి చిన్న కుతూరు విస్లావత్ పూజ(18) ఇంట్లో ఉన్న ఫోన్‌కు ఉన్న చార్జర్ వైర్ తీస్తుండగా, విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే కుప్పకూలిపోయింది. కుటుంబ సభ్యులు మహబూబ్‌నగర్ జిల్లా ఆసుపత్రికి తీసుకెళ్లగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. పూజ తండ్రి ఫిర్యాదు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

యువతి అదృశ్యం

జడ్చర్ల, ఫిబ్రవరి 14: మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలంలోని ఓ గ్రామానికి చెందిన వ్యక్తి తన కూతురు కనిపించడం లేదని ఫిర్యాదు చేసినట్లు జడ్చర్ల ఎస్ఐ చంద్ర మోహన్ తెలిపారు. ఎస్ఐ వివరాల ప్రకారం.. డీఎంఎల్‌టీ కోర్సు పూర్తి చేసిన ఆ యువతి ప్రస్తుతం ఇంటి వద్దనే ఉంటోంది. ఈ నెల 13న రాత్రి కుటుంబ సభ్యులంతా ఇంట్లో పడుకున్నారు. ఉదయం లేచి చూస్తే ఆ యువతి కనిపించలేదు. కుటుంబీకులు బంధువుల ఇళ్లు, పరిసర ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దాంతో తండా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్ఐ తెలిపారు.

నేటి నుంచి సూర్యభగవానుడి బ్రహ్మోత్సవాలు

- రాష్ట్రంలోనే భలాన్‌పల్లిలో ఏకైక దేవాలయం



తాడూరు మండలం భలాన్‌పల్లిలో సూర్యభగవానుడి ఆలయం

తాడూరు, ఫిబ్రవరి 14 : నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలం భలాన్‌పల్లి గ్రామంలో అతి పురాతనమైన సూర్యభగవానుడి ఆలయ బ్రహ్మోత్సవాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఏటా రథసప్తమి సందర్భంగా నిర్వహించే ఈ బ్రహ్మోత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరవుతున్నారు. ఈ ఏడాది సూర్య నారాయణస్వామి పంచమ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. రాష్ట్రంలోనే ఈ ఆలయం ఒక్కటే ఉండటం విశిష్ఠతను సంతరించుకుంది.

బ్రహ్మోత్సవాలు ఇలా..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం ఆరు గంటలకు సూర్యనారాయణస్వామి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగిస్తారు. స్వామి వారికి అభిషేకం, పూజల అనంతరం ఆలయ ప్రాంగణంలో మలయాళ స్వామి విశ్వశాంతి మహాయజ్ఞాన్ని నిర్వహించనున్నారు. 16 శుక్రవారం స్వామి వారికి ఛాయాదేవి, ఉషాదేవి సమేత కల్యాణాన్ని చేయనున్నారు. భక్తులకు అన్నదానం చేస్తారు. అదేరోజు సాయంత్రం నాలుగు గంటల ప్రాంతంలో ఆలయ ప్రాంగణంలో ఎద్దుల బండ్లు, ట్రాక్టర్లతో శకటోత్సవాన్ని నిర్వహిస్తారు. 17న శనివారం సామూహిక వ్రతాలను చేపడతారు. ఉత్సవాలకు ముఖ్య అతిథులుగా నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి, శాసన మండలి సభ్యులు కూచకుళ్ల దామోదర్‌రెడ్డి హాజరవనున్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆలయ కమిటీ సభ్యులు కోరుతున్నారు.

జిల్లా స్థాయి భజన పోటీలు


బ్రహ్మోత్సవాల సందర్భంగా భలాన్‌పల్లి ఆలయంలో జిల్లా స్థాయి భజన పోటీలను నిర్వహిస్తున్నారు. పోటీలు గురువారం మధ్యాహ్నం 1:30 గంటల నుంచి ప్రారంభమవుతాయని నిర్వాహకులు తెలిపారు. మొదటి బహుమతిగా 12,116, ద్వితీయ బహుమతిగా 9,116, తృతీయ బహుమతిగా 6,116, నాల్గో బహుమతిగా 3,116, ఐదో బహుమతిగా 1,116 ఇవ్వనున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మానవపాడు, ఫిబ్రవరి 14 : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్‌ఐ చంద్రకాంత్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని క్లాక్‌టవర్ ప్రాంతానికి చెందిన అమర్‌ప్రసాద్(34) రెండు రోజుల క్రితం తండ్రి రాజేంద్రప్రసాద్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై కర్నూలుకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో జోగుళాంబ గద్వాల జిల్లా మానవపాడు మండలంలోని జాతీయ రహదారి-44పై, గురునానక్ దాబా సమీపంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పి ఇద్దరూ కింద పడ్డారు. తీవ్రంగా గాయపడిన అమర్‌ప్రసాద్‌ను కర్నూల్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చంద్రకాంత్ తెలిపారు.

పంపకాలకు వేళాయే!

- ఢిల్లీలోని ఉమ్మడి ఆస్తుల విభజనకు ముందడుగు
- 19.781 ఎకరాలలో.. ఏపీకి 11.356, తెలంగాణకు 8.245 ఎకరాలు
- తెలంగాణ ప్రతిపాదనకు ఏపీ ఓకే



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): దేశ రాజధాని ఢిల్లీలో రెండు తెలుగు రాష్ట్రాలకు ఉమ్మడిగా ఉన్న ఆస్తుల విభజనలో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఉమ్మడి(ఆంధ్రప్రదేశ్, తెలంగాణ)భవన్ విభజనకు మార్గం సుగమమైంది. మొత్తం 19.781 ఎకరాలలో ఉన్న ఉమ్మడి భవన్ ఆస్తులలో ఏపీకి 11,356 ఎకరాలు, తెలంగాణకు 8.245 ఎకరాలు కేటాయించాలని తెలంగాణ ప్రభుత్వం చేసిన ప్రతిపాదనకు ఏపీ సర్కారు సుముఖత వ్యక్తం చేసింది. ఈ మేరకు ఏపీ ప్రభుత్వ స్పందనను కేంద్ర హోంశాఖ బుధవారం తెలంగాణ ప్రభుత్వానికి తెలియజేసింది. తెలంగాణ సీఎం ఎ.రేవంత్ రెడ్డి, రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకటరెడ్డి చొరవతో గత నెలలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ భవన్ అధికారులతో కేంద్ర హోంశాఖ కీలక సమావేశం నిర్వహించింది. అనంతరం ఉమ్మడి ఆస్తుల విభజనపై తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదనలు పంపింది. ఏపీ భవన్ కింద ఉన్న గోదావరి బ్లాక్ 4.315 ఎకరాలు, శబరి బ్లాక్‌తో పాటు అంతర్గత రహదారులు, దుకాణాలు(ఆక్రమణకు గురైన ప్రాంతం) ఉన్న 0.512 ఎకరాలు, నర్సింగ్ హాస్టల్ 3.359 ఎకరాలు, పటౌడీ హౌస్‌లో 2.396 ఎకరాలు ఏపీకి ఇచ్చేలా ప్రతిపాదన చేశారు. అదే విధంగా శబరి బ్లాక్ కింద ఉన్న 3 ఎకరాలు, పటౌడీ హౌస్‌లో ఉన్న 5.245 ఎకరాలు తమకు కేటాయించేలా తెలంగాణ ప్రతిపాదన చేసింది. అయితే తమకు ప్రతిపాదించిన అంతర్గత రహదారులు, దుకాణాలు(ఆక్రమణలు) ఉన్న ప్రాంతం(0.512 ఎకరాలు) విలువ దాదాపు రూ.250 కోట్లు అని, ఆ ప్రాంతాన్ని స్వాధీనం చేసుకోలేకపోతే అందుకు సరిసమానమైన భూమిని శబరి బ్లాక్ లేదా పటౌడీ హౌస్‌లోని భూమి నుంచి కేటాయించాలని ఏపీ షరతు విధించింది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వ వివరణ కోరుతూ కేంద్ర హోంశాఖ బుధవారం తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి లేఖ రాసింది.

58:42 నిష్పత్తిలో పంపకాలు..

ఢిల్లీలోని ఉమ్మడి ఏపీ భవన్‌కు భూములు, భవనాలు సహా దాదాపు రూ.9,913.505 కోట్ల(దాదాపు పది వేల కోట్లు) విలువైన ఆస్తులు ఉన్నాయి. గోదావరి బ్లాక్, శబరి బ్లాక్, నర్సింగ్ హాస్టల్, పటౌడీ హౌస్ అనే విభాగాల కింద ఉమ్మడి భవన్ ఆస్తులు ఉన్నాయి. ఉమ్మడి రాష్ట్రానికి బయట ఉన్న ఆస్తులను రెండు తెలుగు రాష్ట్రాలు 58:42 నిష్పత్తిలో పంచుకోవాలని రాష్ట్ర పునర్విభజన చట్టంలో పొందుపరిచారు. కాగా, భవన్ పంపకాలలో ఏపీకి 58.32శాతం, తెలంగాణకు 41.68 శాతం ఆస్తులు రానున్నాయి. తెలంగాణ ప్రభుత్వం పటౌడీ హౌస్‌లోని 5.245 ఎకరాల్లో నూతన తెలంగాణ భవన్ నిర్మించేందుకు సిద్ధమవుతోంది.



తమ సోదరుడి పాడె మోస్తున్న మల్లు భట్టి విక్రమార్క, రవి

సోదరుడికి కన్నీటి వీడ్కోలు పలికిన భట్టి

- పాడె మోసి నివాళులు

వైరా, ఫిబ్రవరి 14: అనారోగ్యంతో మృతిచెందిన విశ్రాంత ఆయుష్ అదనపు డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ మల్లు వెంకటేశ్వర్లు అంత్యక్రియలు బుధవారం ఆయన స్వగ్రామంలో అశ్రునయనాల మధ్య ముగిశాయి. డాక్టర్ వెంకటేశ్వర్లు సోదరులైన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి డాక్టర్ మల్లు రవి ఆయన పాడె మోసి నివాళులర్పించారు. అంత్యక్రియలకు ముందు డాక్టర్ మల్లు వెంకటేశ్వర్లు భౌతికకాయాన్ని పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు సందర్శించి నివాళులర్పించారు. అనంతరం అంతిమయాత్రతో ఆయన స్వగ్రామమైన స్నానాల లక్ష్మీపురానికి తీసుకువచ్చారు. గంటసేపు గ్రామస్థుల సందర్శనార్థం అక్కడ ఉంచారు. ఆ తర్వాత ఆయన వ్యవసాయ క్షేత్రంలో అంత్యక్రియలు నిర్వహించారు.

రాష్ట్రంలో భారీగా అధికారుల బదిలీలు

- మునిసిపల్ కమిషనర్లు, వ్యవసాయశాఖలో అసిస్టెంట్ డైరెక్టర్లతో పాటు 95 మంది డీఎస్పీలకు స్థానచలనాలు
- జీహెచ్‌ఎంసీలో కమిషనర్ల బదిలీలు చర్చనీయాంశం

హైదరాబాద్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో.. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా అధికారుల బదిలీలు చేపట్టింది. ఈ మేరకు సంబంధిత శాఖలు బుధవారం ఉత్తర్వులు జారీ చేశాయి. రాష్ట్రవ్యాప్తంగా మునిసిపాలిటీలు, కార్పొరేషన్లలో విధులు నిర్వహిస్తున్న 114 మంది కమిషనర్లను బదిలీ చేస్తూ రాష్ట్ర మునిసిపల్‌శాఖ ఉత్తర్వులిచ్చింది. మంగళవారం 40 మంది కమిషనర్లను బదిలీ చేయగా బుధవారం మరో 74 మంది కమిషనర్లను బదిలీ చేస్తూ ఉత్తర్వులిచ్చింది. ప్రధానంగా జీహెచ్‌ఎంసీ పరిధిలో దీర్ఘకాలంగా పనిచేస్తున్న మునిసిపల్ కమిషనర్ల బదిలీ చర్చనీయాంశమైంది. గత ప్రభుత్వ పెద్దల అండదండలతో ఏళ్లుగా జీహెచ్‌ఎంసీ పరిధిలో తిష్టవేసిన పలువురు కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లకు స్థానచలనం కల్పించారు. అలాగే రాష్ట్ర వ్యవసాయశాఖలో పనిచేస్తున్న తొమ్మిది మంది అసిస్టెంట్ డైరెక్టర్లను బదిలీ చేస్తూ రాష్ట్ర వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు ఉత్తర్వులు జారీచేశారు. మహబూబాబాద్ డీఏవోగా అభిమన్యు, భద్రాద్రి కొత్తగూడెం డీఏవోగా బి.బాబూరావు, సూర్యాపేట డీఏవోగా శ్రీధర్‌రెడ్డిని నియమించారు. పలు డివిజన్లకు ఏడీఏలను కూడా మార్చారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా సివిల్, తదితర విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న 95 మంది డీఎస్పీలను బదిలీ చేస్తూ డీజీపీ రవిగుప్తా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. మంగళవారం 110 మంది డీఎస్పీలు బదిలీ కాగా రెండో జాబితాలో మరో 95 మందిని బదిలీ చేశారు.

బీజేపీ విధానాలకు వ్యతిరేకంగా రేపు సార్వత్రిక సమ్మె

బీజేపీ ప్రభుత్వ వైఫల్యాలపై ఫిబ్రవరి 16న నిర్వహించనున్న కార్మిక సమ్మె, గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని వామపక్ష పార్టీలు పిలుపునిచ్చాయి. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ఉద్యోగ, కార్మిక, రైతాంగ ప్రజావ్యతిరేక విధానాలను, కార్పొరేట్, మతోన్మాద రాజకీయాలను వ్యతిరేకిస్తూ కేంద్ర ట్రేడ్ యూనియన్ సంఘాలు, రైతుసంఘాల ఐక్యవేదిక సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) దేశవ్యాప్తంగా ఆందోళనలకు పిలుపునిచ్చాయని పేర్కొన్నాయి. ఈ మేరకు వామపక్ష పార్టీల తరఫున సీపీఐ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సీపీఐఎంఎల్(ప్రజాపంథా) పోటు రంగారావు, సీపీఐఎంఎల్ (న్యూడెమోక్రసీ) చలపతిరావు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు.



ప్రజాహిత యాత్రలో బండి సంజయ్

'కాళేశ్వరం' బాధ్యులను ఎందుకు అరెస్టు చెయ్యలే?

- ఎంపీ బండి సంజయ్

సిరిసిల్ల, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): కేంద్ర డ్యామ్ సేఫ్టీ అథారిటీ బృందం కాళేశ్వరం ప్రాజెక్ట్‌ను సందర్శించి నివేదిక రూపొందించి చర్యలు తీసుకోవాలని కోరినా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోలేదని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి ఎంపీ బండి సంజయ్ ఆరోపించారు. కాళేశ్వరం బాధ్యులను ఎందుకు అరెస్ట్ చేయడం లేదని ప్రశ్నించారు. అంతేకాక, ఎన్నికల టికెట్ కోసం కన్నకొడుకు పేరునే మార్చేసిన ఘనుడు కేసీఆర్ అని విమర్శించారు. కేటీఆర్ అసలు పేరు కల్వకుంట్ల అజయ్‌రావు అని వెల్లడించారు. సిరిసిల్ల నియోజకవర్గంలోని గంభీరావుపేట, ముస్తాబాద్, తంగళ్లపల్లి మండలాల్లో బండి సంజయ్ బుధవారం ప్రజాహిత యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ తనకు టికెట్ ఇవ్వడం లేదని తెలుసుకున్న కేసీఆర్.. అజయ్‌రావును తీసుకెళ్లి మీ పేరే పెట్టుకున్నానని ఆయనకు చెప్పి టికెట్ తెచ్చుకున్న మోసగాడు కేసీఆర్ అని విమర్శించారు. అబద్ధాలు, మోసాల్లో కేటీఆర్ అయ్యను మించిపోయాడని ఎద్దేవా చేశారు. అయ్య(కేసీఆర్) ఏక్ నంబర్ అయితే కొడుకు(కేటీఆర్) దస్ నంబరని అన్నారు. తెలంగాణకు కేంద్రం పెద్ద ఎత్తున నిధులు ఇస్తోందని, రాజన్న సిరిసిల్ల జిల్లాకు రూ. 1,408 కోట్లు నిధులు ఇచ్చిందని తెలిపారు. కమలం పువ్వు గుర్తుకు ఓటు వేస్తే రాముడికి ఓటు వేసినట్లేనని తెలిపారు. తెలంగాణ ప్రజల పక్షాన బీజేపీ కొట్లాడితే కాంగ్రెస్‌కు అధికారం ఇవ్వడం న్యాయమా? అని అడిగారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేసే పరిస్థితి లేదని, ఎన్నికల కోడ్ నెపంతో ఆ పార్టీ నేతలు తప్పించుకునే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు.

రాష్ట్రంలో 2 లక్షల మందికి 'ముఫ్త్ బిజిలీ'!

(మొదటి పేజీ తరువాయి)

తొలిదశలో భాగంగా 34,59,585 మందికి ఉచితంగా విద్యుత్‌ను అందించాలని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే సూత్రప్రాయంగా నిర్ణయించింది. ఇదే సమయంలో ప్రధాని మోదీ ప్రకటించిన ముఫ్త్ బిజిలీ యోజన రాష్ట్రంలో సంపూర్ణంగా అమలయితే దాదాపు 2 లక్షల మందికి లబ్ధి చేకూరవచ్చని సంబంధిత అధికారవర్గాలు తెలిపాయి. ఈ మేరకు రాష్ట్రప్రభుత్వంపై గృహజ్యోతి భారం స్వల్పంగా తగ్గే అవకాశం ఉంది. మరోవైపు, ప్రతీ నెల 150 యూనిట్ల దాకా విద్యుత్ వినియోగించేవారికి 1-2 కిలోవాట్ల రూఫ్‌టాప్ సోలార్ యూనిట్ ఏర్పాటు చేసుకోవటానికి అవకాశం ఉంది. దీనికి రూ.1.10 లక్షలు వ్యయం కానుండగా... రూ.60 వేలు సబ్సిడీ లభిస్తుంది. మిగిలిన రూ.50 వేలు సొంతంగా పెట్టుకోవాలి. 150 యూనిట్ల విద్యుత్ వాడకానికి నెలకు రూ.700 దాకా బిల్లు వచ్చే అవకాశం ఉండగా... సోలార్ యూనిట్‌తో రూ.625 మేర ఆదా అవుతుందని, బిల్లు కేవలం రూ.75 మాత్రమే చెల్లించే పరిస్థితి ఉంటుందని తెలుస్తోంది. కేంద్ర పథకం కింద రూఫ్‌టాప్ (ఇంటి పైకప్పు మీద) సోలార్ యూనిట్లు పెట్టుకుంటే... వేసవిలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల దాకా విద్యుత్తు ఉత్పత్తి అయ్యే అవకాశం ఉంటుంది. ఈ విద్యుత్‌ను సొంతంగా వాడుకోవచ్చు లేదా డిస్కమ్‌లకు విక్రయించుకోవచ్చు. చీకటిపడ్డాక సౌరవిద్యుత్ ఉత్పత్తి ఆగిపోతుంది కాబట్టి ఆ సమయంలో బ్యాటరీలో నిల్వ చేసిన కరెంట్‌ను లేదా డిస్కమ్‌లు సరఫరా చేసే కరెంట్‌ను వాడుకోవాల్సి ఉంటుంది. కాగా, వినియోగదారుల నుంచి కొనుగోలు చేసే విద్యుత్ ధరను కేంద్రం ఖరారు చేయనుంది.

యూనిట్ల వినియోగం	సోలార్ ప్లాంట్	వ్యయం	కేంద్రం సబ్సిడీ	వినియోగదారుడు భరించాల్సింది
0-100	1 కిలోవాట్	రూ.60 వేలు	రూ.30 వేలు	రూ.30 వేలు
150	2 కిలోవాట్లు	రూ.1.10 లక్షలు	రూ.60 వేలు	రూ.50 వేలు
300	3 కిలోవాట్	రూ.1.65 లక్షలు	రూ.78 వేలు	రూ. 87 వేలు

ముఫ్త్ బిజ్లీ యోజన

ముఫ్త్ బిజ్లీ యోజనలో ఒక కిలోవాట్ సోలార్ ప్లాంట్‌కు రూ.30 వేలు, రెండు కిలోవాట్లకు రూ.60 వేలు, మూడు లేదా అంతకన్నా ఎక్కువ కిలోవాట్ సోలార్ ప్లాంట్లకు రూ.78 వేలు సబ్సిడీ లభిస్తుంది.

భారీగా పెరిగిన సబ్సిడీ

సోలార్ రూఫ్‌టాప్ పథకం ప్రారంభించిన కొత్తలో కేంద్రం 3 కిలోవాట్లదాకా 40 శాతం సబ్సిడీ ఇస్తుండేది. అయితే, క్రమేణా దీనిని తగ్గించుకుంటూ వచ్చారు. ప్రస్తుతం ప్రతి కిలోవాట్‌కు రూ.18 వేల చొప్పున 3 కిలోవాట్లకు రూ.54 వేలు సబ్సిడీ ఇస్తున్నారు. 3 కిలోవాట్ల నుంచి 10 కిలోవాట్ల దాకా కిలోవాట్‌కు రూ.9 వేల చొప్పున సబ్సిడీ ఇస్తున్నారు. ఇక అపార్టుమెంట్లు వంటి గ్రూప్ హౌసింగ్‌కు కిలోవాట్‌కు రూ.9 వేల దాకా సబ్సిడీ లభిస్తోంది. అయితే, ప్రస్తుతం ప్రకటించిన ముఫ్త్ బిజిలీ యోజనలో సబ్సిడీని భారీగా పెంచారు. ఈ పథకం కింద సోలార్ ప్లాంట్ ఏర్పాటు కోసం http://pmsuryaghar.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ప్రభుత్వ ఆమోదం లభించిన తర్వాత ఇంటి పైకప్పు మీద సోలార్ యూనిట్ పెట్టుకోవచ్చు. దక్షిణ డిస్కమ్ (ఎస్పీడీసీఎల్-హైదరాబాద్) పరిధిలో 80 మంది, ఉత్తర డిస్కమ్ (ఎన్పీడీసీఎల్-వరంగల్) పరిధిలో 82 మంది సోలార్‌ప్లాంట్ విక్రేతలు ఉన్నారు.

బీఆర్‌ఎస్‌కు షాక్

కాంగ్రెస్‌లో చేరిన 36 మంది బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు

కొత్తగూడెం టౌన్/వైరా/సూర్యాపేట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్‌కు భారీ షాక్ తగిలింది. కొత్తగూడెం, సూర్యాపేట మునిసిపాలిటీకి చెందిన కౌన్సిలర్లు పార్టీ ఫిరాయించారు. కొత్తగూడెం మునిసిపాలిటీలో బీఆర్‌ఎస్‌కు చెందిన ఓ కౌన్సిలర్‌తో పాటు పలువురు మహిళా కౌన్సిలర్ల భర్తలు, బంధువులు సుమారు 20 మంది కాంగ్రెస్‌లో చేరారు. వీరంతా బుధవారం ఖమ్మం జిల్లా వైరాలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన నాయకులకు ఏఐసీసీ పరిశీలకుడు రోహిత్‌చౌదరి కాంగ్రెస్ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ నెల 19న కొత్తగూడెం చైర్‌పర్సన్ సీతాలక్ష్మిపై అవిశ్వాస తీర్మానం పెడుతున్న నేపథ్యంలో బీఆర్‌ఎస్‌కు చెందిన నాయకులు కాంగ్రెస్‌లో చేరడం రాజకీయ ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్, తదితరులు పాల్గొన్నారు. మరోవైపు, ఎన్నో హై డ్రామాల మధ్య సూర్యాపేట మునిసిపల్ చైర్‌పర్సన్ పదవిని బీఆర్‌ఎస్ నిలబెట్టుకున్నప్పటికీ బీఆర్‌ఎస్ అసమ్మతి కౌన్సిలర్లు మాత్రం చేజారిపోతున్నారు. మునిసిపల్ చైర్‌పర్సన్ పదవిని ఆశించిన 31వ వార్డు కౌన్సిలర్ కొండపల్లి నిఖిలను, ఆమె భర్త దిలీప్‌రెడ్డిని బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ చేయడంతో 16 మంది అసమ్మతి కౌన్సిలర్లు బుధవారం మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి ఆధ్వర్యంలో మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

పాలమూరు ఎన్‌ఆర్‌ఐకి గ్లోబల్‌అవార్డ్



శ్రీకాంత్

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 14 : పాలమూరు బిడ్డకు అత్యున్నత పురస్కారం లభించింది. జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ న్యాయవాది బంగారు హనుమంతు కుమారుడు శ్రీకాంత్‌కు గ్లోబల్ అవార్డ్ వరించింది. అమెరికాలోని లూసియానాలో ఇన్ సర్కిల్స్ కన్‌స్ట్రక్షన్ టెక్నాలజీ డైరెక్టర్‌గా అయన విధులు నిర్వర్తిస్తున్నారు. భవన నిర్మాణాల్లో ఆపదలో ఉన్నవారిని గుర్తించేందుకు ఆయన కనుగొన్న సేఫ్టీకిగాను రైజింగ్ స్టార్ ఆఫ్ సేఫ్టీ 2023 గ్లోబల్ అవార్డ్ పొందారు. అమెరికాలోని స్వచ్ఛంద సంస్థ నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ 2010 నుంచి ప్రపంచ వ్యాప్తంగా విభిన్నమైన పరిశోధనలు చేసిన వారికి ఈ అవార్డ్‌లు ఇస్తుంటారు. ఈ కోటాలో జిల్లావాసికి అవార్డ్ దక్కడం అభినందనీయం. 2023 ఏడాదికి గాను ఈ అవార్డ్‌కోసం ఎనిమిది దేశాల నుంచి 36 మందిని ఎంపిక చేయగా అందులో బంగారు శ్రీకాంత్ ఈ అవార్డుకు ఎంపికకావడం గమనార్హం. లూసియానా స్టేట్ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పట్టా అందుకున్నారు. ప్రస్తుతం ఆయన అధునాతన రోబోటిక్ టెక్నాలజీలో కాంక్రీట్ సామర్థ్యాన్ని తెలుసుకునే పరిశోధన చేస్తున్నారు. నిర్మాణ రంగాలలో పెద్ద సంఖ్యలో మరణాలు సంభవిస్తుండటంతో వాటిని నివారించేందుకే ఈ సేఫ్టీని కనుగొన్నానని ఆయన తెలిపారు.

ముగ్గురికి గాయాలు



ప్రమాదంలో గాయపడిన బాధితులు

గోపాల్‌పేట, ఫిబ్రవరి 14 : వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండల కేంద్రంలోని వీఎంసీ ఫంక్షన్ హాల్ సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. బాధిత కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం... రేవల్లి మండలంలోని కేశంపేట కొత్తతండాకు చెందిన సర్కుబాయ్ తన కోడలు వెన్నెలను ఆసుపత్రిలో చూపించేందుకు కూతురి కుమారుడు, మనువడైన జగదీష్‌తో కలిసి బైక్‌పై వనపర్తిలోని ఓ ఆసుపత్రికి తీసుకొస్తున్నారు. మండల కేంద్రంలోని వీఎంసీ ఫంక్షన్ హాల్ సమీపంలోకి రాగానే బైక్ నడుపుతున్న జగదీష్‌కు ఫిట్స్ వచ్చింది. బైక్ వేగంగా ఉండడంతో రోడ్డు పక్కన గుంతలో ఉన్న పొలాల్లోకి దూసుకెళ్లింది. దీంతో ముగ్గురికీ తీవ్ర గాయాలయ్యాయి. వాహనదారులు, స్థానికులు కలిసి ముగ్గురిని ఆటోలో వనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు. వెన్నెల కింద పడి దొర్లడంతో కడుపులోని తొమ్మిది నెలల శిశువు మృతి చెందింది. సర్కుబాయ్ రెండు చేతులు విరిగాయి. జగదీష్ తల, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. జగదీష్ వనపర్తిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. బుధవారం కళాశాలలో ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు ఉండడంతో గాయాలతోనే జగదీష్ పరీక్షకు హాజరయ్యాడు. సర్కుబాయ్, వెన్నెల ఆరోగ్యం నిలకడగానే ఉందని వైద్యులు తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



సయ్యద్ ఇమ్రాన్ హమ్మద్(ఫైల్)

వంగూరు, ఫిబ్రవరి 14: విద్యుదాఘాతానికి గురై వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండల పరిధిలోని ఉల్పరలో చోటుచేసుకుంది. ఎస్ఐ మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన సయ్యద్ ఇమ్రాన్ హమ్మద్(33) ఇంటి వద్ద నీటి పంపు మోటార్‌ను ఆన్ చేయగా, నీళ్లు బయటకు రాకపోవడంతో మోటార్‌ను పట్టుకొని చెక్‌చేస్తుండగా ప్రమాదవశాత్తు కరెంట్ షాక్‌కు గురై కింద పడిపోయాడు. అతడి సోదరుడు గమనించి వెంటనే ఇమ్రాన్ హమ్మద్‌ను చికిత్స నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతునికి భార్య కుమారుడు, కూతురు ఉన్నారు.

కల్యాణం.. కమనీయం

- పాలెం వేంకటేశ్వర స్వామి వివాహ వేడుకల్లో పాల్గొన్న 295 మంది దంపతులు
- హాజరైన ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ దంపతులు





స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలు; కల్యాణం జరిపిస్తున్న పండితులు

బిజినేపల్లి, ఫిబ్రవరి 14 : అలువేలుమంగ సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా కమనీయంగా కొనసాగింది. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని పాలెంలోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక ఏర్పాటు చేసిన ముత్యాల పందిరి మండపంలో బుధవారం స్వామి, అమ్మవార్ల కల్యాణం ఆలయ ప్రధాన అర్చకుడు కొరవి రామానుజార్యుల ఆధ్వర్యంలో వేదపండితుల వేద మంత్రోచ్చారణలతో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆలయ చైర్మన్ జున్న శేఖర్ రెడ్డి దంపతులు స్వామి వారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. అనంతరం దేవతమూర్తుల ఉత్సవ విగ్రహాలను పల్లకిలో కల్యాణ మండపానికి తీసుకెళ్లి పట్టు వస్త్రాలతో, ఆభరణాలతో అలంకరించారు. అమ్మవారికి, స్వామివార్లకు జిలకర్ర బెల్లం పెట్టించిన అనంతరం మాంగళ్యధారణ భక్తుల హర్షధ్వనుల మధ్య కనుల పండుగ కల్యాణఘట్టం, తలంబ్రాలు నిర్వహించారు. అనంతరం స్వామి కల్యాణోత్సవంలో పాల్గొన్న 295 మంది దంపతులను తిరుమల తిరుపతి స్వామి కల్యాణ చిత్రపటం, లడ్డూ ప్రసాదంతో ఘనంగా సన్మానించి వేదపండితులు ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్ సుమలత దంపతులు, సర్పంచ్ జి.లావణ్య, నాగరాజు దంపతులు, ఉపసర్పంచ్ చికొండ్ర రాములు, చంద్రకళ దంపతులు, ఆలయ స్థల దాత నారాయణ రెడ్డి, ఈవో సీహెచ్ రంగారావు, సభ్యులు సొప్పరి బాలస్వామి, గాడి సురేందర్, గంధం వెంకటేశ్వర్లు, అర్చకులు జయంత్, చక్రపాణి, ఆలయ సిబ్బంది బాబయ్య, శివకుమార్, శ్రీదేవి, వలంటీర్లు కొంకల మధు, శివకుమార్, జగదీష్, వెంకటేష్, వెంకటరమణ, దయానంద్, గోపాలస్వామి తదితరలు ఉన్నారు.



వివాహానికి హాజరైన భక్తులు

● నాగర్‌కర్నూల్ జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, రుచా దంపతులు వెంకన్న స్వామి కల్యాణోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. మొదటిసారి ఆలయానికి వచ్చిన ఆయన ఆలయ విశిష్ఠతను, చరిత్రను ఆలయ చైర్మన్ జున్న శేఖర్ రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్పీ దంపతులను శాలువాతో సత్కరించి, తిరుమల తిరుపతి స్వామి వారి కల్యాణోత్సవ చిత్ర పటం, లడ్డూ ప్రసాదం అందజేశారు.

కాంగ్రెస్‌ను గెలిపించడంలో మహిళల ప్రముఖ పాత్ర

- పార్లమెంట్ ఎన్నికల్లో అదే స్ఫూర్తిని కొనసాగించాలి
- అసెంబ్లీకి రాకుండా ముఖం చాటేస్తున్న కేసీఆర్
- మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు



సమావేశంలో మాట్లాడుతున్న సునీతారావు

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 14 : రాష్ట్రంలో 51 శాతం ఉన్న మహిళా ఓటు బ్యాంక్ కాంగ్రెస్ విజయంలో ప్రముఖ పాత్ర పోషించిందని మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు అన్నారు. అదే స్ఫూర్తితో పార్లమెంట్ ఎన్నికల్లో మహిళలు కాంగ్రెస్‌కు అండగా నిలబడి రాష్ట్రంలో 12 ఎంపీ స్థానాలు గెలిపించాలని కోరారు. బుధవారం డీసీసీ కార్యాలయంలో మహిళా కాంగ్రెస్ మండల, బ్లాక్ కాంగ్రెస్ నాయకులతో సమావేశమయ్యారు. పార్లమెంట్ ఎన్నికలపై సమీక్ష నిర్వహించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలో పోటీ చేసేందుకు మహిళలు పెద్దసంఖ్యలో ముందుకు రావాలని కోరారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అసెంబ్లీకి రాకుండా ముఖం చాటేస్తున్నారని విమర్శించారు. ధరణి పోర్టల్ పేరుతో సర్వేనెంబర్లు మార్చి అడ్డగోలుగా దోచుకున్నారని, కాళేశ్వరం పనులు నాసిరకంగా చేపట్టి దోచుకున్న డబ్బులు ఎవరి జేబుల్లోకి వెళ్లాయని ప్రశ్నించారు. నాసిరకం పనులు చేపట్టి మళ్లీ కాంగ్రెస్‌ను విమర్శిస్తారా ? రండి అసెంబ్లీకి వచ్చి వాస్తవాలు ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్ ఎన్నికలోనూ ఆ పార్టీకి చెక్‌పెట్టడం ఖాయమన్నారు. అహంకారపూరితంగా పాలన సాగించిన బీఆర్‌ఎస్‌కు ప్రజలు గుణపాఠం చెప్పారన్నారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని దుయ్యబట్టారు. బీఆర్‌ఎస్, బీజేపీ పాలనలపై ప్రజలు విసుగుచెందారని, ఆ పార్టీలకు ఓట్లు వేసే పరిస్థితి లేదని విమర్శించారు. మహిళాలోకం పెద్దఎత్తున కాంగ్రెస్‌కు అండగా నిలబడి గెలిపించారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలలో భాగంగా మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాన్ని కోట్ల మంది మహిళలు సద్వినియోగం చేసుకుంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై పెద్దఎత్తున ప్రశంసలు వస్తున్నాయన్నారు. అదే విధంగా 200 యూనిట్ల ఉచిత విద్యుత్ కూడా త్వరలోనే అమలుకానుందని, రూ.500కు సిలిండర్ కార్యక్రమాన్ని కూడా తొందరలోనే అమలు చేస్తామన్నారు. ఈ సమావేశంలో మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు వసంత పాల్గొన్నారు.

18న పీటీజీలో సీవోఈ సెట్ ప్రవేశ పరీక్ష

మన్ననూర్, ఫిబ్రవరి 14: అమ్రాబాద్ మండలం మన్ననూరు పీటీజీ గురుకుల జూనియర్ కళాశాలలో తెలంగాణ గిరిజన గురుకుల ప్రతిభ కళాశాలల్లో చేరేందుకు నిర్వహించే కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్సీ (సీవోఈ) ప్రవేశ పరీక్షను ఈ నెల 18(ఆదివారం) నిర్వహించనున్నట్లు పీటీజీ ప్రిన్సిపాల్ నిమ్మల పద్మావతి తెలిపారు. పరీక్ష కేంద్రంలో 384 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారని, వారికి కావాల్సిన ఏర్పాట్లను పూర్తి చేశామని తెలిపారు. పరీక్ష రాసే విద్యార్థులు 18వ తేదీ ఉదయం 8 గంటల వరకే పీటీజీ గురుకులం పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని, పరీక్ష ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఉంటుందన్నారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు హాల్‌టికెట్, ఆధార్ కార్డు, ప్యాడ్, నీలం, నలుపు వర్ణం పెన్నులు తీసుకొని రావాలని కోరారు.

మేడారం జాతరకు ఆర్టీసీ సిబ్బంది

పాలమూరు, ఫిబ్రవరి 14 : మహబూబ్‌నగర్ రీజియన్ నుంచి మేడారం జాతరకు వెళ్లే ప్రతీ డ్రైవర్, కండక్టర్‌కు బీపీ, షుగర్, ఇతర రెగ్యులర్‌గ వాడే మందులు తీసుకుని వెళ్లాలని ఆర్ఎం శ్రీదేవి బుధవారం ఒక ప్రకటనలో సూచించారు. క్రమం తప్పకుండా డ్రైవర్లు, కండక్టర్లు మందులు వేసుకుని డ్యూటీలుచేయాలన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే ఆర్టీసీ అధికారులను కలుసుకోవాలన్నారు.

హాస్టల్ నిర్మాణంలో జాప్యం తగదు

- పీయూ వీసీ ప్రొఫెసర్ ఎల్‌బీ లక్ష్మీకాంత్ రాథోడ్

పాలమూరు యూనివర్సిటీ, ఫిబ్రవరి 14 : పాలమూరు యూనివర్సిటీలో బాలికల హాస్టల్ నిర్మాణ పనుల్లో జాప్యం తగదని, నిర్మాణ పనుల వేగం పెంచాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను పీయూ వీసీ ప్రొఫెసర్ ఎల్‌బీ లక్ష్మీకాంత్ రాథోడ్ ఆదేశించారు. బుధవారం పీయూలోని నూతనంగా నిర్మిస్తున్న బాలికల హాస్టల్ పనులను పీయూ పీజీ ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రకిరణ్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణయ్యలతో కలిసి పరిశీలించారు. నిర్మాణంలో నాణ్యత పాటించాలని సూచించారు. విద్యార్థినులకు ఇబ్బందులు కలగకుండా బాలికల హాస్టల్ భవనాన్ని అతి త్వరలోనే ప్రారంభిస్తామని మీడియాకు తెలిపారు.

● వసంత పంచమి పర్వదినాన్ని పురస్కరించుకొని పీయూ వీసీ ప్రొఫెసర్ ఎల్‌బీ లక్ష్మీకాంత్ రాథోడ్, పీయూ పీజీ ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రకిరణ్, అధ్యాపకులతో కలిసి పీయూలో నెలకొల్పిన సరస్వతి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి అలంకరించి అర్చన కార్యక్రమాలు నిర్వహించారు.

కానిస్టేబుల్ ఫోన్ అపహరణ

- వెంబడించి దొంగను పట్టుకున్న కానిస్టేబుల్, స్థానికులు



ఫోన్ దొంగిలించిన వ్యక్తిని స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులుఉ

నాగర్‌కర్నూల్ క్రైం, ఫిబ్రవరి 14 : నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో బుధవారం ఒక కానిస్టేబుల్‌కు సంబంధించిన ఫోన్‌ను దొంగ అపహరించుకుని పారిపోతుండగా పట్టుకుని పోలీసులకు అప్పగించారు. అచ్చంపేట బస్సు ఎక్కుతుండగా కానిస్టేబుల్ బాలయ్య సెల్‌ఫోన్‌ను దొంగ అపహరించుకొని పారిపోతుండగా గుర్తించిన కానిస్టేబుల్ వెంబడించి పట్టుకున్నారు. స్థానిక పోలీసులకు సమాచారమివ్వగా అక్కడికి చేరుకుని దొంగను పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు.

రోడ్డు ప్రమాదంలో మాజీ సర్పంచ్‌కు గాయాలు

వెల్దండ, ఫిబ్రవరి 14 : నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండల పరిధిలోని చెర్కూర్ గ్రామ సమీపంలో హైదరాబాద్ - శ్రీశైలం ప్రధాన రహదారిపై బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో బర్కత్‌పల్లి మాజీ సర్పంచ్ బీరయ్య తీవ్రంగా గాయపడ్డాడు.

ద్విచక్ర వాహనంపై తన స్వగ్రామానికి వెళ్లేందుకు చెర్కూర్ వద్ద వాహనం మలుపుతుండగా శ్రీశైలం వెళుతున్న కారు ఢీకొంది. దీంతో బీరయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడ్డ బీరయ్యను స్థానిక యెన్నం ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు.

ఓటరు లిస్టును పకడ్బందీగా నిర్వహించాలి

తాడూరు, ఫిబ్రవరి 14 : మండల కేంద్రంతో పాటు మండలంలోని అన్ని గ్రామాలకు సంబంధించిన ఓటరు లిస్టుల్లో ఎలాంటి తప్పులు లేకుండా పకడ్బందీగా ఉంచే విధంగా చర్యలు తీసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ మహ్మద్ అలీ అన్నారు. బుధవారం మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న పోలింగ్ బూత్‌ల వద్ద గ్రామానికి సంబంధించిన ఓటరు లిస్టులను చదివి గ్రామస్థులకు విన్పించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన డిప్యూటీ తహసీల్దార్ మహ్మద్ అలీ మాట్లాడుతూ మండలంలోని 24 గ్రామపంచాయతీల పరిధిలో 37 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ పోలింగ్ బూత్‌ల పరిధిలో మండల వ్యాప్తంగా 30వేల 173మంది ఓటర్లు ఉండగా వీటిలో 15వేల 047పురుష ఓటర్లు కాగా, 15వేల 126మంది మహిళా ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. రానున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఓటరు లిస్టుల్లో ఎలాంటి తప్పులు దొర్లకుండా జాగ్రత్త పడాల్సిందిగా సూచించారు. లేకుంటే ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు.

బీజేపీ ప్రభుత్వ దమనకాండను ఖండించండి



నిరసన వ్యక్తం చేస్తున్న తెలంగాణ రైతు సంఘం నాయకులు

నాగర్‌కర్నూల్ టౌన్, ఫిబ్రవరి 14: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతులపై దమనకాండను ఖండించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాసులు పిలుపునిచ్చారు. బుధవారం తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాసులు మాట్లాడుతూ రైతు వ్యతిరేక నల్ల చట్టాలను ఉపసంహరించుకున్న సందర్భంలో కేంద్ర ప్రభుత్వం రాతపూర్వకంగా రాసి ఇచ్చిన హామీలను అమలు చేయాలని నిరసన వ్యక్తం చేస్తున్న రైతులపై దాడులు చేయడం సమంజసం కాదన్నారు. ఢిల్లీలో శాంతియుతంగా నిరసన చేస్తున్న రైతులపై ఢిల్లీ పోలీసు యంత్రాంగాన్ని మోహరించి లాఠీచార్జి, నీటి ఫిరంగులు, రబ్బర్ బుల్లెట్లు, బాష్పవాయువు డ్రోన్లతో దాడులు చేయడం దుర్మార్గమన్నారు. దాడులు చేయడాన్ని ప్రజాస్వామ్యవాదులు ముక్తకంఠంతో ఖండించాలని కోరారు. ఇచ్చిన హామీలను నెరవేర్చేదాక రైతు సంఘాల పోరాటం ఆగదని కేంద్రాన్ని హెచ్చరించారు. నాయకులు రమేష్, నాగరాజుగౌడ్, వెంకటేష్, బాలరాజు, సత్యం, శివ, సురేష్, రైతులు పాల్గొన్నారు.

అటెండర్, వంట మనిషిని తక్షణమే నియమించాలి

కొల్లాపూర్, ఫిబ్రవరి 14 : కొల్లాపూర్ మండల పరిధిలోని చుక్కాయపల్లి ప్రాథమిక పాఠశాలలో అటెండర్‌ను, వంట మనిషిని తక్షణమే నియమించాలని తెలంగాణ మాదిగ దండోరా జిల్లా అధ్యక్షుడు డీకే మాదిగ డిమాండ్ చేశారు. బుధవారం కొల్లాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని చుక్కాయపల్లి ఉన్నత పాఠశాలను తెలంగాణ మాదిగ దండోరా జిల్లా అధ్యక్షుడు డీకే మాదిగ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆడపిల్లల చేత స్కూల్‌గ్రౌండ్‌ను శుభ్రం చేయించడం, రూములు శుభ్రం చేయించడం లాంటి పనులు చేయిస్తున్నారని వెంటనే ఎంఈవో స్పందించి పాఠశాలలో అటెండర్‌ను, వంట మనిషిని నియమించాలని డిమాండ్ చేశారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలపై ఉన్నతాధికారులు స్పందించకుంటే దళిత సంఘాల ఆధ్వర్యంలో నిరసన, ధర్నా కార్యక్రమం చేపడుతామని హెచ్చరించారు. తెలంగాణ మాదిగ దండోరా నియోజకవర్గ అధ్యక్షుడు మల్లెల వెంకటస్వామి మాదిగ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సుష్మాస్వరాజ్ జయంతి


సుష్మాస్వరాజ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న నాయకులు

కందనూలు, ఫిబ్రవరి 14 : నాగర్‌కర్నూల్‌లోని బీజేపీ జిల్లా కార్యాలయంలో బీజేపీకి చెందిన మహిళా నాయకురాలు కేంద్ర మాజీ విదేశాంగ మంత్రి, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి సుష్మాస్వరాజ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. బుధవారం బీజేపీ జిల్లా కార్యాలయంలో ఆమె చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు బీజేపీ నాయకులు ఆమె సేవలను కొనియాడారు. జిల్లా ఆఫీస్ సెక్రటరీ సి.చందు, జిల్లా ఉపాధ్యక్షుడు పోల్‌దాసు రాము, మండల అధ్యక్షుడు లోహిత్‌రెడ్డి, ఎలిమే రాము, భీమేష్, మండల ప్రధాన కార్యదర్శి మల్లేష్, బీజేవైఎం మండల కోశాధికారి సి.ఆంజనేయులు, బూత్ అధ్యక్షుడు సంజయ్, పరుశరామ్, నాయకులు రాము పాల్గొన్నారు.

సరస్వతీ దేవికి ప్రత్యేక పూజలు

అచ్చంపేటటౌన్, ఫిబ్రవరి 14: వసంత పంచమి పురష్కరించుకొని బుధవారం పట్టణంలో సరస్వతీ శిశుమందిర్ పాఠశాలలో డాక్టర్ బందం బాల్ నారాయణ చిన్నారులు విధ్యభ్యాసం చేశారు. అదేవిధంగా వాసవీక్లబ్ డైమండ్ ఆధ్వర్యంలో సరస్వతీ దేవి విగ్రహానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ క్రాంతి, సుధాకర్, వెంకటేష్, నరేష్, సాయి ప్రసాద్, వినోద్, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

'దేశ సంస్కృతిని నాశనం చేసేందుకు ప్రేమికుల రోజు'

అచ్చంపేటటౌన్, ఫిబ్రవరి 14: దేశ సంస్కృతిని నాశనం చేసేందుకు ఈ ప్రేమికుల రోజు వచ్చిందని బీజేవైఎం సీనియర్ నాయకుడు ప్రదీప్ రెడ్డి అన్నారు. ప్రేమికుల రోజుకు విరుద్ధంగా బుధవారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో విద్యార్థులతో కలిసి బీజేవైఎం ఆధ్వర్యంలో ప్రేమికుల చిహ్నాలకు సంబంధించి కార్డులను కాల్చివేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫిబ్రవరి 14న దేశ రక్షణలో సైనికుల అమరులు అయిన రోజు అని, ఆ రోజున సైనికులకు నివాళులు అర్పించాలన్నారు. మన దేశంలో లేని సంస్కృతిని మనం పరిచయం చేశారని, అది దేశాన్ని నాశనం చేయడానికి వచ్చిందన్నారు. బీజేవైఎం నాయకులు నేనావత్ రాకేష్, శాంతన్, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య

నాగర్‌కర్నూల్ క్రైం, ఫిబ్రవరి 14 : అనారోగ్యానికి గురై మనస్తాపం చెంది రామ్మూర్తి ఎల్లయ్య(65) ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ గోవర్ధన్ బుధవారం తెలిపారు. వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ మండలంలోని తూడుకుర్తి గ్రామానికి చెందిన ఎల్లయ్య గత కొంతకాలం నుంచి అనారోగ్యంతో బాధపడుతూ ఎక్కడ చికిత్స చేయించుకున్న తగ్గకపోవడంతో మనస్తాపానికి గురై గ్రామ చివరన చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటనపై మృతుని కుమారుడు రాముడు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. మృతునికి ఇద్దరు కుమారులు, భార్య ఉన్నారు.

గుడిసె, పశుగ్రాసానికి నిప్పు పెట్టిన దుండగులు

బల్మూరు, ఫిబ్రవరి 14 : మండల కేంద్రానికి చెందిన బిజ్జ రాములు అనే రైతుకు సంబంధించిన ఐదు బండ్ల పశుగ్రాసంతో పాటు పక్కనే ఏర్పాటు చేసుకున్న గుడిసెకు దుండగులు నిప్పుపెట్టగా దగ్ధమై నట్లు బాధితుడు తెలిపారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. శివారులోని తన వ్యవసాయ పొలంలో గడ్డిని ఏర్పాటు చేసి పక్కనే ఉన్న వ్యవసాయ పనిముట్లు గుడిసెలో భద్రపరిచాను. అయితే శుభకార్యాలకు వేరే ప్రాంతానికి వెళ్లగా, గుర్తు తెలియని వ్యక్తులు కావాలని తమ గడ్డివామును తగలబెట్టారని ఆయన ఆరోపించారు. దాదాపు 40వేల వరకు నష్టం జరిగిందని, ప్రభుత్వపరంగా ఆదుకోవాలని ఆయనకోరారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఉప్పునుంతల, ఫిబ్రవరి 14: ఉప్పునుంతల మండల పరిధిలోని కంసానిపల్లి గ్రామానికి చెందిన కొట్టె గణేష్‌కు సంబంధించిన ట్రాక్టర్ బుధవారం ఎలాంటి అనుమతులు లేకుండా అచ్చంపేటకు అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా ప ట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. ట్రాక్టరులో ఇసుకను తరలిస్తుండగా కేజీబీవీ బాలికల పాఠశాల వద్ద స్థానిక పోలీసులు వెంకటేష్, రవి పట్టుకొని పరిశీలించారు. అనుమతులు లేకపోవడంతో పోలీసు స్టేషన్ తరలించారు. డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై అంజయ్య తెలిపారు.

నేటి నుంచి రంగాపూర్ తండాలో బ్రహ్మోత్సవాలు

వంగూరు, ఫిబ్రవరి 14: మండల పరిధిలోని రంగాపూర్‌లో వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 15 నుంచి 17 వరకు వైభవంగా జరుగనున్నాయి. రథసప్తమిని పురస్కరించుకొని ప్రతీ సంవత్సరం ఇక్కడ కనుల పండుగగా బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. ఉత్సవాల సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. మూడు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలకు వంగూరు మండలంతో పాటు కల్వకుర్తి, అచ్చంపేట నియోజకవర్గాలలో వివిధ గ్రామాల నుంచి వేలాదిగా భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకొని తమ మొక్కుబడులను సమర్పిస్తారు. 15న గణపతి పూజ, 16న వేంటేశ్వర స్వామి కల్యాణం, 17న సత్యనారాయణ స్వామి వ్రతాలు, సాయంత్రం కోట మైసమ్మ తల్లికి బోనాలు నిర్వహిస్తారు.


రంగాపూర్ తండాలో ఉత్సవాలకు ముస్తాబైన ఆలయం

ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి



వేంకటేశ్వర స్వామి ఆలయం ఎంతో ప్రసిద్ధి చెందింది, మూడు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశాం. అచ్చంపేట, కల్వకుర్తి నియోజకవర్గాల నుంచి భక్తులు వేలాదిగా వచ్చి ఉత్సవాల్లో పాల్గొని స్వామి వారిని దర్శించుకుంటారు. భక్తులకు తాగునీరు, అన్నదానం కార్యక్రమాలు ఏర్పాటు చేశాం.

- సల్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్

కార్మిక చట్టాలను అమలు చేయాలి


పెద్దకొత్తపల్లిలో విలేకర్లతో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కే ఏసయ్య

పెద్దకొత్తపల్లి, ఫిబ్రవరి 14 : కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కే.ఏసయ్య, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పెబ్బేటి విజేయుడులు డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రమైన పెద్దకొత్తపల్లిలో వారు విలేకర్లతో మాట్లాడుతూ కార్మికులు అనేక త్యాగాలతో, పోరాటాలతో తెచ్చుకున్న కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చిందన్నారు. దీంతో వ్యవసాయ కార్మికులు, రైతాంగం తీవ్ర నష్టాలకు గురవుతున్నారని వారన్నారు. కేంద్ర ప్రభుత్వం కనీస వేతనాన్ని నిర్ణయించే విధానానికి స్వస్తి పలకాలని ఆయన అన్నారు. సమ్మె హక్కులను కాలరాస్తూ తిరిగి 12గంటల పని దినాలను అమల్లోకి తేస్తుందని, కాంట్రాక్టర్ లేబర్ విధానం అన్ని రంగాల్లో మరింత పెంచి కార్మికులను శ్రమదోపిడీకి గురి చేస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ కార్మికులకు కనీస వేతనం నెలకు 26వేలు ఇవ్వాలని, పెంచిన నిత్యావసర సరుకుల ధరలను తగ్గించాలని, వ్యవసాయం చేసే ప్రతి రైతుకు ప్రభుత్వం ఐదు లక్షల సహాయం అందించాలని రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని వారు డిమాండ్ చేశారు.

కేంద్ర బీజేపీ ప్రభుత్వం కార్మిక రైతాంగ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 16న దేశవ్యాప్త కార్మిక సమ్మెలో గ్రామీణ భారత్‌బంద్‌లో రైతులు, వ్యవసాయదారులు, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. సీపీఐ మండల కార్యదర్శి బి.శ్రీనివాసులు, నాయకులు కుర్మయ్య, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

తాడూరు, ఫిబ్రవరి 14 : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక, కర్షక, దళిత, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 16న జరిగే దేశవ్యాప్త సమ్మెకు డీహెచ్‌పీఎస్ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని, సమ్మెను జయప్రదం చేయాలని డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు కొమ్ము భరత్ బుధవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బీజేపీ అధికారంలోకి వచ్చి పది సంవత్సరాలైందని ఈ పది సంవత్సరాల కాలంలో కార్మికులకు, కర్షకులకు, దళిత గిరిజనులకు, ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. అన్ని ట్రేడ్ యూనియన్లు, రైతు వ్యవసాయ కార్మిక సంఘాలు, సామాజిక సంఘాలు, జాతీయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 16న జరిగే సమ్మెను జయప్రదం చేయాలని కొమ్ము భరత్ విజ్ఞప్తి చేశారు.

● బిజినేపల్లి: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 16న దేశ వ్యాప్తంగా తలపెట్టిన సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బంగారి పర్వతాలు కోరారు. మండల కేంద్రంలో బుధవారం ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మారేడు శివశంకర్‌తో కలిసి సమ్మె వాల్‌పోస్టర్‌ను విడుదల చేసి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్మికులకు, కర్షకులకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఈనెల 16న చేపట్టే సమ్మెను విజయవంతం చేసి నిరసన వ్యక్తం చేద్దామని పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ నాయకులు చినపాగ శ్రీనివాసులు, శ్రీశైలం, షకీల్, తిరుపతయ్య, రాజు, ఆంజనేయులు, మల్లేష్ తదితరులు ఉన్నారు.

● కల్వకుర్తి: గ్రామీణ్ బంద్‌కు కేవీపీఎస్ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని ఆ సంఘం జిల్లా కార్యదర్శి పలిజాల పరుశరాములు తెలిపారు. కల్వకుర్తిలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ నిర్వహించే దేశవ్యాప్త సమ్మెలో ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కేవీపీఎస్ నాయకులు బాలస్వామి, అశోక్ తదితరులు ఉన్నారు.

జయప్రదం చేయాలి

దేశవ్యాప్తంగా ఈ నెల 16న నిర్వహించే సార్వత్రిక సమ్మె గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు విజయలక్ష్మి కోరారు. కల్వకుర్తి పట్టణ పరిధిలో సార్వత్రిక సమ్మె విజయవంతంపై ఆమె స్థానిక నాయకులతో కలిసి అవగాహన కల్పించారు. కాటన్‌మిల్లు కార్మికులు, వివిధ వర్గాలతో కలిసి సమ్మె విజయవంతంపై ప్రచారం నిర్వహించారు. సీఐటీయూ అధ్యక్షుడు ఆంజనేయులు, సీపీఎం నాయకులు ఏపీ మల్లయ్య, నాయకులు కిశోర్, లక్‌పతినాయక్, జయమ్మ, ఆలివేల, సుజాత, వరలక్ష్మీ, శ్రీనివాస్‌రెడ్డి, మహేష్‌గౌడ్, శేఖర్, భారతి, రాధా, లత, శారద తదితరులు ఉన్నారు.

● తెలకపల్లి: దేశవ్యాప్త సమ్మె గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నందిపేట భాస్కర్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ ఆవరణలో బుధవారం ప్రజా కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సమ్మె కరపత్రాలను విడుదల చేశారు. రాష్ట్ర భవన నిర్మాణ కార్మిక సంఘం సభ్యుడు సి.రామకృష్ణ, గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు తుమ్మ మహేష్, గ్రామపంచాయతీ వర్కర్స్ మసమ్మ, పార్వతమ్మ, రాముడు, బాలస్వామి, చంద్రమ్మ, పరుశరాములు, వెంకట్, లక్ష్మయ్య, బాబు తదితరులు పాల్గొన్నారు.



కల్వకుర్తిలో విలేకర్లతో మాట్లాడుతున్న కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి పి.పరుశరాములు

● కందనూలు: దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మారేడు శివశంకర్ కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నాగర్‌కర్నూల్ మండలంలో కుమ్మెర గ్రామంలో సమ్మె వాల్ పోస్టర్లను విడుదల చేశారు.

ఏఐటీయూసీ జిల్లా మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు చినపాగ శ్రీనివాసులు, కుమ్మెర గ్రామపంచాయతీ కార్మికులు దేవమ్మ, రామేశ్వరమ్మ, వెంకటమ్మ, కడప లక్ష్మమ్మ, కూలీలు దాసరి కృష్ణయ్య దాంగట్ల ఎల్లయ్య, తిరుపతయ్య, లక్ష్మయ్య, ప్రతాప్‌రెడ్డి, కురువ భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

హరితహారం మొక్కలకు భద్రత కరువు

- రోడ్ల వెంట కాలిన మొక్కలు

తాడూరు, ఫిబ్రవరి 14 : మండల కేంద్రంతోపాటు మండలంలోని గ్రామాల్లో తెలంగాణ ప్రభుత్వం గత కొన్నేళ్లుగా ఎంతో కష్టపడి పెంచి పెద్ద చేసిన హరితహారం మొక్కలు రహదారుల వెంట కాలిబూడిదవుతున్నాయి. వీటిని పర్యవేక్షించే అధికారులు సక్రమంగా చర్యలు తీసుకోకపోవడం మూలంగా మొక్కలు కాలుతున్న దుస్థితి నెలకొంది. బుధవారం మండలంలోని యాదిరెడ్డిపల్లి గ్రామ సమీపంలో తాడూరు, యాదిరెడ్డిపల్లి గ్రామాల మధ్య ఉన్న ప్రధాన రహదారిపై మొక్కలు అగ్నికి ఆహుతి అయిన వైనం నెలకొంది. వాటిని చూసిన వారందరూ ఎంతో పెద్దగా అయిన మొక్కలు ఇలా కాలిపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ఇప్పటికైనా అధికారులు స్పందించి ఎంతగానో వెచ్చించి పెంచిన హరితహారం మొక్కలను అగ్నికి ఆహుతి కాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు గ్రామాల్లోని ప్రజలందరికీ హరితహారం మొక్కలు ఎక్కడా అగ్నికి ఆహుతి కాకుండా ప్రజలకు అవగాహన కల్పించాల్సిందిగా కోరుతున్నారు.


యాదిరెడ్డిపల్లి గ్రామ సమీపంలో ప్రధాన రహదారిపై కాలిపోయిన హరితహారం మొక్కలు

ఆర్టీసీ ఉద్యోగులు అంకితభావంతో పని చేయాలి

నాగర్‌కర్నూల్ టౌన్, ఫిబ్రవరి 14: ఆర్టీసీ ఉద్యోగులు వృత్తి పట్ల అంకితభావంతో పని చేస్తే సంస్థ నుంచి ప్రోత్సాహకాలు అందుతాయని మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్(ఎంవీఐ) నవీన్ అన్నారు. జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా బుధవారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లకు ప్రోత్సాహకాలను అందజేశారు. ఈ సందర్భంగా డిపో మేనేజరు దేవరాజు మాట్లాడుతూ ఉత్తమ డ్రైవర్‌గా అవార్డు అందుకున్న 26 సంవత్సరాలుగా ఎలాంటి రిమార్కు లేకుండా ఎం.తిరుపతయ్యను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఎంవీఐ నవీన్ మాట్లాడుతూ డ్రైవర్లు వహనం నడిపే సమయంలో సెల్‌ఫోన్ మాట్లాడ రాదని, మద్యం సేవించి వాహన నడపరాదన్నారు. ఆర్టీసీ ఉద్యోగులు భాస్కర్, బాల్‌రెడ్డి, శ్రీనివాసులు, పరుశురాం, వీఎస్.నారాయణ, యాదయ్య, షాహీన్‌బేగం, సత్యం, సతయ్య, నరసింహ, వెంకట్ రాములు, బాలచంద్రయ్య, మైబూస్ తదితరులు పాల్గొన్నారు.


నాగర్‌కర్నూల్ ఆర్టీసీ డిపోలో ఉద్యోగులకు ప్రోత్సాహకాలు అందజేస్తున్న ఎంవీఐ నవీన్, డిపో మేనేజరు దేవరాజు

ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలి

కొల్లాపూర్: ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే ప్రయాణికులను సురక్షితంగా వారి గమ్యస్థానాలకు చేర్చాలని కొల్లాపూర్ డిపో మేనేజర్ ఉమాశంకర్ అన్నారు. కొల్లాపూర్ ఆర్టీసీ డిపోలో బుధవారం డిపో మేనేజర్ అధ్యక్షతన జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమానికి కొల్లాపూర్ పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్ రిషికేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెరుగుతున్న రోడ్డు ట్రాఫిక్‌ను దృష్టిలో ఉంచుకుని ఏకాగ్రతతో బస్సులను నడిపి ప్రయాణికులను సుక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలని సూచించారు. జనవరి నెలలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన డ్రైవర్, కండక్టర్, మెకానికల్ ఉద్యోగులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. అదేవిదంగా సంస్థలో 24సంవత్సరాల నుంచి ఎలాంటి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తగా డ్రైవింగ్ చేస్తూ ప్రయాణికుల మన్ననలు పొందిన డ్రైవర్ కే రామకృష్ణను శాలువాతో సత్కరించి సన్మానించారు. ఎంఎఫ్ యాదయ్య, డిప్యూటీ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ గోవర్దన్, డీఎం కార్యాలయ సూపరింటెండెంట్ నజీర్, మెకానికల్ ట్రాఫిక్ సూపర్‌వైజర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


కొల్లాపూర్‌లో ఆర్టీసీ ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న డిపో మేనేజర్ ఉమాశంకర్

'కళాశాల గుర్తింపును రద్దు చేయాలి'

నాగర్‌కర్నూల్ టౌన్, ఫిబ్రవరి 14: ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షల పేరుతో ఒక్కో విద్యార్థి నుంచి రూ.వెయ్యి వసూలు చేసిన జిల్లా కేంద్రంలోని శ్రీనివాస పద్మావతి జూనియర్ కళాశాల గుర్తింపును రద్దు చేయాలని బీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.రామకృష్ణ, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మధుగౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలో బీఎస్ఎఫ్, ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒక వైపు ఫీజు రీఎంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్ రాక విద్యా ర్థులు తీవ్ర ఇబ్బదులు పడుతుంటే పద్మావతి కళాశాల యాజమాన్యం విద్యార్థుల నుంచి డబ్బులు వసూలు చేయడం దారుణమన్నారు. విద్యార్థుల నుంచి డబ్బులు వసూలు చేసిన పద్మావతి కళాశాల యాజమాన్యంపై జిల్లా ఇంటర్ విద్యా నోడల్ అధికారికి ఫిర్యాదు చేసినా నేటికి ఎలాంటి చర్యలు లేవని పేర్కొన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి వసూలు చేసిన డబ్బుల ను తిరిగి విద్యార్థు లకు ఇప్పించి, కళా శాలపై చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో విద్యార్థి సం ఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని వా రు హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మారేడు శివశంకర్, విద్యార్థి సంఘాల నాయకులు చందు, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

ఐదు క్వింటాళ్ల నల్లబెల్లం పట్టివేత

వెల్దండ, ఫిబ్రవరి 14 : మండల పరిధిలోని బొల్లంపల్లి చౌరస్తా వద్ద బుధవారం ఏపీ 36 ఏఆర్ 1098 నెంబరుగల కారులో నల్లబెల్లం తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. వెల్దండ వైపునుంచి చారకొండ వైపుకు వెళుతున్న కారును పోలీసులు తనిఖీలో భాగంగా ఆపగా అందులో ఉన్న ఇద్దరు వ్యక్తులు కారును వదిలి పారిపోయారు. పోలీసులు కారును సోదాచేయగా అందులో 18 సంచులలో సుమారు 5 క్వింటాళ్ల 40 కిలోల నల్లబెల్లం, రెండు సంచులలో సుమారు 80 కిలోల పటిక ఉన్నట్లు గుర్తించారు. పట్టుబడిన బెల్లం విలువ సుమారు 81 వేలు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. నెంబరు ఆధారంగా కారు యజమాని ఊర్కొండపేటకు చెందిన ముడావత్ దేవేందర్, డ్రైవర్ నల్గొండ జిల్లా తూర్పుపల్లి గ్రామానికి చెందిన భాస్కర్‌గా గుర్తించారు. ఈ మేరకు వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎం.రవి తెలిపారు.

నాగర్‌కర్నూల్ డీఎస్పీ బదిలీ

నాగర్‌కర్నూల్ క్రైం, ఫిబ్రవరి 14 : నాగర్‌కర్నూల్ డీఎస్పీ మోహన్‌కుమార్ బుధవారం బదిలీ చేస్తూ ప్రభుత్వం జారీ చేశారు. ఆయన స్థానంలో రాచకొండ కమిషనర్ పరిధిలోని మహేశ్వరం ఏసీపీగా విధులు నిర్వహిస్తున్న బుర్రి శ్రీనివాస్ నాగర్‌కర్నూల్ రానున్నారు.

ఉచిత విద్యుత్ ఆన్‌లైన్ నమోదుకు నేడు చివరి రోజు

చారకొండ, ఫిబ్రవరి 14: గృహజ్యోతి పథకం కింద రెండు వందల యూనిట్లు ఉచిత విద్యుత్ ఆన్‌లైన్ నమోదుకు నేడు చివరి తేది అని విద్యుత్ ఏఈ జానకిరాంనాయక్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో తెల్ల రేషన్‌కార్డు కలిగి ఉన్నవారు గృహజ్యోతి పథకం ద్వారా ఉచిత విద్యుత్‌కోసం ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని అన్నారు. దరఖాస్తు చేసుకొనేవారు. గృహజ్యోతి పథకం ద్వారా దరఖాస్తు చేసుకొన్న ఫారం, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, విద్యుత్ బిల్లు జిరాక్స్ పత్రాలను విద్యుత్ సిబ్బందికి అందజేసి ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని అన్నారు. గృహజ్యోతి పథకం లబ్దిదారులు విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరారు. స్పెషల్ అధికారి రాఘవేందర్‌గౌడ్, బాలునాయక్, లైన్ ఇన్‌స్పెక్టర్ రాజునాయక్, లైన్‌మెన్ శేఖర్, గణేష్, జూనియర్ లైన్‌మెన్ వెంకటేష్, మహేష్ శ్రీశైలం, రామస్వామి, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం అందజేత

కల్వకుర్తి, ఫిబ్రవరి 14 : కల్వకుర్తి పట్టణంలోని వడ్డెర బస్తీ కాలనీకి చెందిన దివ్యాంగురాలు రషియాబేగంకు మిత్ర ఫౌండేషన్ అధ్యక్షుడు చంద్రకాంత్‌రెడ్డి, సభ్యులు జీవనోపాధి కోసం కుట్టు మిషన్‌కు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో మిత్ర ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

బెస్ట్ అవైలబుల్ స్కూల్స్‌కు దరఖాస్తుల ఆహ్వానం

నాగర్‌కర్నూల్ టౌన్, ఫిబ్రవరి 14: బెస్ట్ అవైలబుల్ స్కూళ్ల ఎంపికకు జిల్లాలోని అర్హత కలిగిన ఇంగ్లీష్ మీడియం స్కూల్స్ ఈ నెల 19 లోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఎస్సీ సంక్షేమశాఖ అధికారి రాంలాల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ పథకంలో రెసిడెన్సియల్ విద్యార్థులకు ట్యూషన్, హాస్టల్ వసతి, రెండు జతల దుస్తులు, పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలకు ప్రతి విద్యార్థికి రూ.42 వేలు ప్రభుత్వం చెల్లిస్తుందని పేర్కొన్నారు. అదేవిధంగా డే స్కాలర్స్ విద్యార్థులకు రూ.28 వేలు ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. ఈ పథకంలో మూడేళ్ల పూర్తి అయిన పాఠశాలలు తిరిగి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అర్హత, ఆసక్తి కలిగిన పాఠశాలలు డీఈవో గుర్తింపు ఉత్తర్వుల కాపీతో పాటు మేనేజ్‌మెంటు వివరాలతో నిర్దేశించిన తేదీలోగా జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పూర్తి వివరాలకు డీఈవో కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.

'మునిసిపల్ సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలి'

అచ్చంపేటటౌన్, ఫిబ్రవరి 14: మునిసిపల్ సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని మునిసిపల్ చైర్మన్ నర్సింహ గౌడ్ అన్నారు. బుధవారం పట్టణంలోని మునిసిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన డయల్ యువర్ మునిసిపల్ చైర్మన్ కార్యక్రమంలో ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడారు. మునిసిపల్ సిబ్బంది సక్రమంగా పనిచేసి సమస్యలు, ఫిర్యాదులు రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. పారిశుధ్య నిర్వహణ విషయంలో సిబ్బందిని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడానికి సిబ్బంది కృషి చేయాలన్నారు. పట్టణంలో పెరుగుతున్న కాలనీల దృష్ట్యా ప్రతి ఏరియాకు సీసీ రోడ్లు, డ్రైనేజీలు ఆర్థికపరమైన అంశాలతో కూడినదని, కాబట్టి ఎమ్మెల్యే సహకారం దశలవారీగా పట్టణాన్ని అభివృద్ధి చేసుకుందామన్నారు. మునిసిపల్ కమిషనర్ శ్రీహరి రాజు, కౌన్సిలర్లు గౌరీశంకర్, రమేష్ రావు, మన్నుపటేల్, అంతటి శివ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ


ఊర్కొండపేటలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు అందజేస్తున్న నాయకులు

ఊర్కొండ, ఫిబ్రవరి 14: మండలంలోని ఊర్కొండపేటతో పాటు పలు గ్రామాల్లో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను అధికారులు స్థానిక నాయకులతో కలిసి బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద కుటుంబాలకు కల్యాణలక్ష్మి చెక్కులు ఎంతో లబ్ధి చేకూరుతుందని వారు పేర్కొన్నారు. గ్రామాల్లోని కార్యక్రమాల్లో గిర్దావర్లు సతీష్ చంద్ర, రాఘవేంద్రరావు, స్థానిక నాయకులు వహీద్, మనోహర్ రెడ్డి, నర్సిరెడ్డి, చంద్రయ్య, మన్సూర్, రవీందర్ గౌడ్, మాసుం తదితరులు ఉన్నారు.

దేవాలయ నిర్మాణానికి భూమి పూజ

పెంట్లవెల్లి, ఫిబ్రవరి 14 : మండల కేంద్రంలోని అభయాంజనేయస్వామి దేవాలయ సమీపంలో వినాయక, సుబ్రహ్మణ్యేశ్వర, శివలింగం, నవగ్రహాలకు బుధవారం భూమి పూజ చేశారు. ఉదయం మాఘశుద్ధ పంచమిన 10:18 గంటలకు ఆలయ అర్చకులు బసవరాజ్ భూమి పూజ చేశారు. పూజా కార్యక్రమానికి వచ్చిన భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఆలయ అర్చకుడు లోకేశ్వరయ్య, భక్తులుపాల్గొన్నారు.

ఖాతాదారులకు బీమాపై అవగాహన

ఉప్పునుంతల, ఫిబ్రవరి 14: ఉప్పునుంతలలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో బుధవారం సింగిల్‌విండో చైర్మన్ భూపాల్‌రావు, ఏజీఎం అభయ్‌కుమార్‌లు రైతులకు బీమాపై అవగాహన కల్పించారు. రైతులకు పంట రుణాలు సకాలంలో చెల్లించిన వారికి అనుకోకుండా ఏదైనా ప్రమాదం జరిగితే వారికి బీమా చెల్లించడం జరుగుతుందని వారు తెలిపారు. ఉప్పునుంతల సంఘం ద్వారా 3852 మంది సభ్యులకు వ్యక్తిగత ప్రమాద బీమా చెల్లించడం జరుగుతుందని వారు తెలిపారు. గత సంవత్సరం విగ్నేష్‌పూర్ గ్రామానికి చెందిన చిలికేశ్వరం బొజ్జమ్మ పిడుగుపాటుకు గురై మృతి చెందింది. ఆ కుటుంబ సభ్యులకు రూ. 2 లక్షల చెక్కులను అందజేశారు. డైరెక్టర్లు నారాయణరెడ్డి, శ్రీను తదితరులు ఉన్నారు.

సంతూర్ ఉమెన్ స్కాలర్‌షిప్‌కు నలుగురు విద్యార్థుల ఎంపిక

నాగర్‌కర్నూల్ టౌన్, ఫిబ్రవరి 14: సంతూర్ ఉమెన్ స్కాలర్‌షిప్‌కు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల నుంచి నలుగురు విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ మధుసూదన్‌శర్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్కాలర్‌షిప్ నిబంధనల ప్రకారం ప్రభుత్వ కళాశాలల్లో చదివే విద్యార్థులు దీనికి అర్హులని, సోనీ, పూజిత, నాజ్ కతూన్, హసీబా బేగం ఎంపికయ్యారని పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులకు డిగ్రీ పూర్తయ్యే వరకు సంవత్సరానికి రూ. 24 వేలు చొప్పున చెల్లిస్తారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల అధ్యాపకులు అభినందించారు.

ఘనంగా ఉర్సు

వెల్దండ, ఫిబ్రవరి 14 : మండల కేంద్రంలో ఉర్సుషరీఫ్ ఉత్సవాలు బుధవారం రాత్రి ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా దర్గావద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మాజీ సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్లు సంజీవ్‌కుమార్, వెంకటయ్యగౌడ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సుంకిరెడ్డి వరప్రసాద్‌రెడ్డిలు హాజరై ముస్లిం పెద్దలతో కలిసి ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా అన్నదానం చేశారు. జంగయ్య యాదవ్, కృష్ణముదిరాజ్, శ్రీను, నిర్వాహకులు ఎండీ సాధిక్, రషీద్, కోఆప్షన్ హలీం, శంషు, ఇల్యాస్ ఉన్నారు.